# మొద్దురాచిప్ప

## - కొండేపూడి నిర్మల

**ప**దిహేడో ఎక్కం బుర్రకెక్కడం లేదు. పదమూడేళ్ళ చిట్టికి గుండెల్లో రైళ్ళు పరిగెత్తడం మొదలెట్టాయి. బుడ్డీలో భూతంలా తెరిచిన ఎక్కాల పుస్తకంలోంచి నాలుక చాపి నుంచున్న పదిహేడో ఎక్కం చిట్టి ప్రాణం చెండుకు తినేస్తోంది.

రాత్రి ఎనిమిది దాటింది.

ఎక్కం అప్పజెప్పకపోతే చిట్టికివాళ శీలం దక్కేలా లేదు. ఒకటి నుంచి ఇరవై వరకూ ఎక్కాలన్నీ నోటికొచ్చేసి 'వెరీ గుడ్లు'ఇచ్చిపోయిన అనంతలక్ష్మి, పార్వతి, కల్పన, గోదావరి- అంతా గొడవ గొడవగా కబుర్లు చెప్పుకుంటూ బాబరు దండయాత్ర మ్యాపులు గీస్తున్నారు.

చిట్టికూడా వాళ్ళతో కలిసి అల్లరి చెయ్యాలని పిస్తోంది.

వచ్చినా మాట్లాడకూడదని బెట్టుగానూ వుంది.

పదిహేడో ఎక్కం ఓ పట్టాన కొరుకుడు పడ్డమేలేదు.

ఎక్కం చదివి, ఇంగ్లీషు కాపీ రాసి, మ్యాపుగీసి.... ఇవాల్టికి యింటి కెళ్ళే ప్రాప్తమసలు వుందో లేదో.

చదివెయ్యాలి చదివెయ్యాలి. జిడ్డు పట్టిన యిడ్లీ పళ్ళాన్ని తోమినట్టు బర బర అప్పజెప్పెయ్యాలి.

''భలేగా చెప్పావే'' అంటూ బుగ్గ గిల్లడానికి ముందుకొచ్చిన సార్ చేతికి దొరక్కుండా వెనక్కి తిరిగి గోడవారనున్న పుస్తకాల సంచీ అందుకుని బిక్క పరుగున వెళ్ళిపోవాలి.

జరగబోయే దాన్ని గురించి ఆదుర్దా ఎక్కువైన కొద్దీ మెదడు మొద్దుబారి పోతున్నట్టుగా వుంది.

కసిగా జామెట్రి బాక్సు మూత పెట్టేసి పార్వతి దగ్గరకు జరిగింది. చిట్టిని చూస్తూనే మొహం తిప్పుకుంది పార్వతి. వాళ్ళిద్దరికీ కూచునే బెంచీల దగ్గర పేచీలొచ్చి అరగంట కాలేదు. 'మీ ముగ్గురి కంటే నేను కొంచెం పెద్దయ్యాను కదే. అంచేత సార్‌కి దూరంగా ఆ చివర బెంచీ మీద కూచుంటానే' ప్రాణం చంపుకుని అడిగింది చిట్టి ట్యూషన్‌కి వచ్చి రాగానే.

''మాకేమిటీ నువు పెద్ద దానివైతే మటుక్కి మన ఒప్పందం ప్రకారం సోమ, మంగళ నేను, బుధ, గురు అనంత, శుక్ర శని నువ్వూ కూచోవాలి సార్ పక్కన. మొన్న నువు అబ్సెంట్ అయిన్రోజు నేను 'కూచో లేదా చచ్చినట్టు'. కల్పన కెలాగూ కాల్లేదు కదా అంచేత అది కదల్లేదు''. అంది కరాఖండీగా. చిట్టికి ఏమనడానికి తోచటం లేదు. ఉరికంబం ఎక్కినట్టు దిగులుగాల్లే నుంచుండి పోయింది. కాసేపు.కల్పన పోలియో కాలి వంక అసూయగా చూసింది.

ఇకనో ఇంకాస్సేపటికో సార్ రానే వస్తాడు. గ్రామరు పుస్తకం కోసం లోపలికెళ్ళి ఇంటికొచ్చిన చుట్టంతో మొదలెట్టిన కుశల ప్రశ్నలు ఈ పాటికి అయిపోతూ వుంటాయి.

వచ్చీ రాగానే లెక్కలెందుకు చెయ్యలేదంటాడు.

అర్థం కాలేదంటే అందరూ వెళ్ళేదాకా ఆపేస్తాడు.

అర్థమయిందంటే ఆన్సరెందుకు రాలేదంటాడు.

ముందు నుయ్యి వెనక గొయ్యి.

పోట్లాట రాకుండా బావున్న రోజుల్లో అయితే ఏ గోదావరి బుక్కులోంచే హాయిగా లెక్కలన్నీ చూసి కాపీ కొట్టేసేదే. ఇప్పుడలాంటి లాభాల్లేవు. ఎక్కం చదువుతూనే ఆలోచనలో పడింది చిట్టి.

'పదండే పోదాం మ్యాపులు గియ్యడం అయ్యిందిగా. చీకటయ్యాక కూచోవాల్సిన ఖర్మమనకేమిటి' అందర్నీలేవదీసింది అనంత. ఈ అనంత కూడా పార్వతి స్నేహం పట్టి చెడిపోతోంది. ఫ్రెండు కదాని మొన్న

గొబ్బిళ్ళ పేరంటంలో నాలుగరటిపళ్ళు వాయనం యిచ్చింది తను. ఛీ కృతజ్ఞత లేదు. చిట్టి కూడా మొహం తిప్పుకుని ఎక్కం వల్లె వేయడం కొనసాగించింది.

ఆడ పిల్లలంతా వెళ్ళిపోయారు.

'మొద్దురాచ్చిప్ప' చిట్టి ఒక్కతే ఒంటరిగా మిగిలి పోయింది. నాపరాళ్ళ మీద రాసుకుపోతున్న సుద్దముక్కలా పదిహేడోఎక్కం ధాటికి గొంతరిగి పోతోంది. దాహం వేస్తున్నట్టుగా వుంది. తలెత్తి మాటి మాటికి గుమ్మంలోకి చూస్తూ అంకెలు లెక్క పెట్టడం కసరత్తులా వుంది.

కొడతారని కుర్చీ పక్కనున్న రూళ్ళకర్రనీ కనిపించ కుండా మూలనున్న పుస్తకాల బీరువా కిందికి నెట్టేసి హమ్మయ్యా అనుకుంది.

కొట్టడు, గిచ్చుతాడు. జలదరించినట్టు వొళ్ళంతా కుదించుకుంది. పిక్కబాశం పెడతాడనుకుంటూ తొడమీద! ఆలోచన మరీ ఖంగారు పెట్టినట్టనిపించి దాచిపెట్టిన రూళ్ళ కర్రతీసి మళ్ళీ బల్లమీద పెట్టేసింది.

తలుపు దగ్గర అలికిడైంది. చిట్టికి గుండె జారి పోయి నట్టయి అరచేత్తో నోరు నొక్కేసుకుంది. మాస్టారు కాదు ఆయన పెద్ద కూతురు హైహీల్స్ చప్పుడు చేసుకుంటూ వచ్చి గోడమూలనున్న మంచి నీళ్ల జగ్గందుకుని వెళ్ళి పోయింది.

చిట్టి బరువుగా ఊపిరి పీల్చి వదిలింది.

అసలీ ఎక్కంతో యివాళ పట్టుబడాల్సింది కాదు. హోంవర్కు కిచ్చిన లెక్కల్లో ఒక స్టెప్పు తప్పుగా వెయ్యడం మూలాన పొద్దున్న క్లాసులో దొరికిపోయింది.

'ఏమిటిది ఏమిటీ స్టెప్పు ఎనిమిది పదిహేళ్ళెంత' రాక్షసుడిలా అరిచాడు సార్.


అదిరిపాటుతో మూత్రం వచ్చినంత పనయిపోయి నోటికొచ్చిన అంకేదో చెప్పేసింది చిట్టి.

ఒక్క దూకున ముందుకొచ్చి ఎడమచెయ్యి పుటుక్కున మెలి తిప్పాడు. కళ్ళముందు నక్షత్రాలు పేలినట్టయి బాధతోవిలవిల్లాడింది చిట్టి. దాంతో అదే భుజమ్మీదున్న కొత్తవోణీ జారి...సర్దుకునేందుకు కూడా భయమే అడ్డుపడి బిక్కచచ్చినట్టు నుంచుండి పోవాల్సి వచ్చింది.

'చెప్పవేం ఎనిమిది పదిహేళ్లెంత' జడలు పట్టుకుని గుంజబోయిన చేతికి దొరక్కుండా తప్పించుకుని

'ఎక్కం మొత్తం రాసి చూపిస్తాను సార్' అంది గొంతు పెగుల్చుకొని. ఎందుకంటే రాయడం తేలిక గుణించు కుంటూ వేళ్ళ లెక్కెట్టుకుంటూ ఎంత పెద్ద లెక్కయినా ఈజీగా చేసి పారెయ్యొచ్చు. అన్నీ కంఠతా రావాలనే దిగుల్లేదు. అప్పుడప్పుడు మర్చిపోయినా కొంపలంటుకోవు. ఆరో క్లాసు దాకా అమలాపురంలో లెక్కలన్నీ తని ల్లాగే చేసింది. ఈ ముప్పాళ్ళ పద్ధతి వేరేలా వుంది. ఈసారి కన్నీ కంఠతా పట్టి చెప్పాల్సిందే. రాస్తానంటే వూరుకోడు. మొదట్నించీ బట్టీ పట్టడానికి అలవాటు పడ్డ పిల్లలంతా బడబడా అప్పజెప్పేసి






జారుకున్నారు. తనకీవాళ కాలం మూడినట్టే వుంది. పది నిముషాల్లో వస్తానని చెప్పిన మాస్టారు పదకొండో నిమిషానయినా వూడిపడతాడు. ఎక్కం రావాలి దేవుడా ఎక్కం రావాలి.

ఈ గండం గనక గడిస్తే నూటయాభై కొబ్బరికాయలు కొట్టి.... హమ్మయ్యో అమ్మ చంపుతుందీ పోనీ నాలుగు... ఊహు మూడు పొద్దుల ఉపవాసం ఖచ్చితంగా వుంటాను కనకదుర్గమ్మ తల్లీ నువ్వే గనక దేవతవైతే... అంటూ తెలుగు నోట్సు మీదున్న బొమ్మకి భక్తిగా దణ్ణం పెట్టుకుంది.

సార్ వచ్చేలోపు జాతకం గిర్రున తిరిగిపోవాలి.

ఎక్కం తలకెక్కడం ఒక సమస్యయితే అది ఆయన మొహం చూస్తూ చెప్పడం యింకో సమస్య.

ఆయన్ని చూసిన మొదట్రోజు నుంచే తన శరీరాన్ని ద్వేషించుకోవడం మొదలెట్టింది చిట్టి.

'ఏమే... ఒసే.... భడవకానా.... నిన్నెవడు చేసుకుంటాడోనే...' అంటూ ఏమిటేమిటో మాట్లాడుతూ బుగ్గలు పట్టుకుని లాగుతూ, జడలు పట్టుకుని గుంజుతూ ఆల్జీబ్రా చెబుతుంటే లబ్‌డబ్ లబ్‌డబ్... గుండె చప్పుడెక్కువై అర్థమయిందర్థమయిందంటూ బుర్రంతా శూన్యం. మొన్నటికి మొన్న నూటికి ఎనిమిది మార్కులొచ్చాయి లెక్కల్లో. ఏడుపొచ్చింది చిట్టికి. అసలా లెక్కలంటేనే వాంతొచ్చినంత వికారం పెడుతోంది.

'అమ్మా నేనివాళ ట్యూషన్‌కి వెళ్ళనే! సార్ కొడుతున్నాడు' ఏ రోజుకా రోజు ఆశగా అడుగుతోంది.

'సిగ్గులేకపోతే సరి, చదువురాని మొద్దురాచ్చిప్పల్ని కొట్టక ముద్దెట్టుకుంటాడే' ఖస్సుమంటుంది అమ్మ.

ముద్దులు కూడా పెడతాడే అదింకా ఘోరం- అందామనుకుంటుంది గానీ ఎంచాతో నోరు పెగల్దు.

ప్చ్! ఈ అమ్మ లెందుకని అర్థం కాదు. అమ్మని కూడా పదిహేడో ఎక్కం అప్పజెప్పమని ట్యూషన్‌కి పంపాలి అప్పుడు తెలుసొస్తుంది. ఛీ అమ్మొక రాక్షసి. పదిహేడో ఎక్కమొక పిశాచి. మాస్టారొక భూతం కాదు ప్రేతం. ప్రేతమంటే చచ్చిపోయినవాళ్లటగా భలే భలే. కదలకుండా మెదలకుండా ఎవరి జాకిట్లలోకి ముళ్ళు గుచ్చినట్టు చూడకుండా కళ్ళు మూసుకుని బిగుసుకుపోయిన మాస్టారి రూపం తల్చుకున్న కొద్దీ మనశ్శాంతిగా అనిపించింది చిట్టికి. అసలెందుకు చదవాలి. తలుపు తీసేవుంది కదా పారిపోతే! కొత్త ఆలోచన వచ్చింది. ఆ ఆలోచన బావున్నట్టు కూడా తోచింది. గబ గబ పుస్తకాలు సర్దుకుంది. చప్పుడవుతాయని కాళ్ళ జోళ్లు తొడుక్కోకుండా కాసేపు చేత్తోనే పట్టుకుని పిల్లి గేటు దాటేసింది. హమ్మయ్య అని ఊపిరి విడిచి ఎవరో తరుముకొస్తున్నంత తొందరగా పావుగంట దూరాన్ని అయిదు నిమిషాల్లో చేరుకుంది. ముందు గదిలో ఎదురు చూస్తూ అమ్మ కనిపించలేదు. తమ్ముడింకా ఆటల నించి వచ్చినట్టు లేదు.

అమ్మా ఫీజెక్కువైనా సరే రేపట్నించీ ప్రైవేటు కోసం మా లలితా మేడమ్ దగ్గరికే వెడతాను. అంటూ గట్టిగా దీర్ఘం తీస్తూ వరండాలోంచి మధ్య గదిలో కొచ్చింది. వొంటిట్లో రవ్వలడ్డూ ఉండ కడుతూనే పక్కింటావిడతో సుదీర్ఘంగా సంభాషణలో మునిగిపోయిన అమ్మకి అది వినిపించినట్టు లేదు. ఆవిడ అడిగిన ఏదో ప్రశ్నకి జవాబుగా అంటోంది.

'లేదొదినా నానిగాడి సంగతివేరు. వాడికి కుదురు తక్కువైనా చురుకైన వాడు. మా చిట్టికి నాలాగానే వానా కాలం చదువు అవుతుందేమోనని భయమేస్తూ వుంటుంది. మన రోజులెలాగో గడిచిపోయాయనుకో. ఈ కాలంలో ఎల్లాగనిఆడా మగా అంతా సమానమే అంటున్నారాయే! ఈ మొద్దు రాచ్చిప్పకి నిద్దర లేచింది మొదలూ బడెప్పుడెగ్గొడదామా అనే ధ్యాస తప్ప బాధ్యత తెలీడం లేదు!' అంటోంది బాధగా, గోడకి ఆవతలే ఆగిపోయిన చిట్టికికళ్లలో నీళ్లు గొంతులోకి దిగ మింగుడు పడ్డం కష్టమై పోయింది. వొంటిమీదున్న వోణి తీసి కుర్చీలోకి విసిరికొట్టింది. ఏదో బరువు తగ్గినట్టయింది. అంతటితో ఆగక కుప్ప పోసిన వోణీని గోళ్ళతోనూ పళ్ళతోనూ పర పర చింపేసి కసిగా నవ్వేసుకుంది. ఆ మర్నాడే క్లాసులో అనుకోని సంఘటన జరిగింది.

కాలమూ దూరమూ లెక్కలు చెబుతూ బోర్డుమీద సూత్రాలు రాస్తున్నాడు సార్. చక చకా నోట్సు లోకి ఎక్కించుకుంటోంది చిట్టి. వున్నట్టుండి హయ్యో అని అరవబోయి ఆపేసింది కల్పన. బ్లేడుతో మామిడికాయ చెక్కు తీస్తున్న అనంత వేలు కోసుకున్న బాధను అణచుకుంటూ కూచుంది. ఉప్పు కారం పొట్లాలు విప్పి తాయిలం తినడానికిసిద్ధం చేస్తున్న కల్పన హయ్యో అంది. చిట్టి గమనిస్తూనే వుంది. సార్‌కి వినిపించినట్టు లేదు. 'లెక్కలు వినకుండా యిందాకట్నించీ అల్లరి చేస్తున్నారు సార్' అని చెప్పడానికి ఉవ్విళ్ళూరుతున్న చిట్టి కూడా అనంత వంక చూసి నిశ్శబ్దంగా వుండిపోయింది. బెంచీ కింద దాచిపెట్టిన అనంత బొటనవేలి నుంచి రక్తం బొట్లు బొట్లుగా కారుతోంది. రాసుకుంటున్న దల్లా ఆపేసి అనంత పక్కనున్న సంచీ దగ్గరకు లాక్కుంది చిట్టి.

సారీ అంది అనంత, రక్తపు బొట్టు పడి యింకిన చిట్టి పుస్తకాల సంచీ వంక గిల్టీగా చూస్తూ.

అబ్బే అందుక్కాదు అన్నట్టుగా తలూపి సంచీ గుమ్మరించి ఓ చాక్ పీస్ బైటికి తీసింది చిట్టి. బెంచీకేసి చిదిమి పౌడరు చెయ్యమని పార్వతికి పురమాయించింది. పార్వతితో బాటు గోదావరి కూడా చాక్ పీస్ నూరడం మొదలెట్టింది. అనంతబొటన వేలి మీద ఆ పొడిని అద్దారు.

రక్తం క రడం ఆగింది. థ్యాంక్‌యూ అంది చిట్టి వంక మొహమాటంగా చూస్తూ అనంత.

'ష్! సార్ చూస్తాడు' గొణిగింది కల్పన.

'చూస్తున్నట్టున్నాడు జార్తా!' వెనక బెంచీ లోంచి చిట్టి వీపు తట్టి చెప్పింది గోదావరి.

'రానివ్వు చెబుదాం' అన్నట్టు తలెగరేసింది చిట్టి.

'అర్థమయినట్టేనా' అడుగుతూ ముందుకొస్తున్నాడు సార్.

లేదు అంది చిట్టి కరాఖండిగా.

లేదు లేదు లేదు వరసాగ్గా పదిహేను గొంతులు మోగాయి.

తెల్లబోవడం మాస్టారి వంతయింది.

'ఏం వొళ్ళు కొవ్వెక్కిందా' అరిచాడు మాస్టారు. ఎవరూ మాట్లాడలేదు.

ఒక్కొక్కళ్ళ చెంపలు వాయించుకుంటూ వస్తున్నాడు. టప టప మోగుతున్నాయి లేత చెంపలు.

'హబ్బ' ఆగిపోయాడు కళ్ళు నులుముకుని విలవిల్లాడుతూ.

ఏమిటి ఏమిటి ఏమైంది సార్! మామిడి ముక్కల కోసం తెచ్చిన కారం గుండ గాల్లోకి వూదిన కల్పన కూడా అమాయకంగానే అడిగింది.

'ఎదో పడింది కంట్లో.. ఏమిట్రా యింతమండిపోతోంది.'

''చూస్తారేం వెధవల్లారా హయ్యో నీళ్ళు పట్రండి ముందు'' చిందులేస్తున్నాడు సార్.

నిమిషాల మీద నీళ్ల గ్లాసొచ్చింది. కళ్లు వత్తుకోవడానికి ఓ జేబురుమాలు కూడా నడిచొచ్చింది. కుదురుగా కూచోలేక పిల్లల ముందు అరవలేక ఓ జేబురుమాలు మొహాన వత్తుకుని అవస్థలు పడుతున్నాడు సార్.

'ఎనిమిది పదిహేళ్ళెంత సార్' చిట్టి అడిగింది. ఆ గొంతులో ఏం వుందో అర్థమయ్యేలోపు,

'ఆర్కిమెడిస్ సూత్రం మళ్ళీ చెప్పండి సార్' అనంత.

'పైథాగరస్ సిద్ధాంతం ఎప్పుడు పుట్టింది సార్' పార్వతి.

'థర్మాస్ ఫ్లాస్క్ నిర్మాణం గీసి చెప్పరూ' గోదావరి.

వాళ్లెందుకలా అడుగుతున్నారో అడగడానికి వెనకున్న ఉద్దేశ్యమేమిటో అర్థం కావడానికి అయిదారు నిమిషాలు పట్టింది సార్‌కి.

విప్పలేక విప్పలేక భగ్గుమంటున్న కళ్ళు విప్పాడు. ఎవరి మొహం చూసినా ఏదో పండగలాంటి సంబరం కనిపించింది. ఇరవై రెళ్ళు నలభై కళ్ళు గుచ్చి గుచ్చి అతన్నే చూస్తున్నాయి. మొదటిసారిగా ఏదో ఇబ్బందని పించింది. అంచేత ఆగలేక 'ఇదిగో యివ్వాళ్టికి యిళ్ళకి పొండి. రెండ్రోజుల్లో స్లిప్ టెస్టుంది తెలుసుగా. మార్కులు గాని సరిగ్గా రాకపోయాయో...' అనేసి ఆగిపోయాడు.

రాకపోతే ఏం చెయ్యదలుచుకున్నాడో చెప్పి బెదిరించడానికి ఆయన దగ్గర భాష లేదు. పిల్లలంతా కేరింతలు కొడుతూ యింటిదారి పట్టారు.

